ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 22 జనవరి 2024 | 5

నేడు స్పందన యథాతథం


రాజమహేంద్రవరం రూరల్ జనవరి 21: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే స్పందన యథాతథంగా జరుగుతుందని అధికారులు తెలిపారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజ లు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు రావాలన్నారు.





అమ్మ కరుణిస్తే.. వేషం మార్చాల్సిందే!

ఆచార సంప్రదాయాలకు హిందువులు పెట్టిందిపేరు.. తరం మారినా నాటి తరం ఆచారాలు నేటికీ పాటిస్తూనే ఉంటారు. దీనికి ఉదాహరణే తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని కర్రి వారి సతెమ్మ జాతర ... ఆ జాతరకు వెళితే చాలా మంది వివిధ వేషధారణల్లో కనిపిస్తారు.. వారంతా కళాకారులు కాదండోయ్... గ్రామానికి చెందిన యువకులు.. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు రూథర్‌ఫర్డ్, గోల్డ్‌మెన్, దేవతలు, రాక్షసులు తదితర వేషాలతో అలరించారు. అంతే కాదండోయ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు సోమవారం జరిగే జాతరలో విచిత్ర వేషాలు ధరించి భిక్షాటన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ జాతరలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని విభాగాలకు చెందిన యువత వేషధారణలు వేయడం ఆసక్తికరంగా ఉంటుంది. - అనపర్తి



జగమంతా రామమయం



కోరుకొండలో శోభయాత్ర



అయోధ్య రామమందిరం గీసిన విద్యార్థి సాత్విక్

జై శ్రీరామ్.. జై శ్రీరామ్ నినాదాలతో జగమంతా ఊగిపోయింది.. ఎందుకంటే రాముడు లేని ఊరు లేదు.. రామ పేరు లేని ఇల్లూ లేదు.. అంతలా రాముడు జనంతో మమేకం.. అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే జగమంతా పండుగలా మారింది.. ఎవరి నోటా విన్నా అదే మాట.. ఎక్కడ చూసినా అదే పాట.. సత్యదేవానర్సరీ నర్సరీ రైతులు పుల్లా సత్యనారాయణ(చంటియ్య), పుల్లా పెదసత్యనారాయణలు వారి నర్సరీలో వివిధ రకాల మొక్కలు, పరిమళాలు వెదజల్లే రంగురంగుల పూలతో శ్రీరాముని ప్రతిరూపాన్ని, రామమందిరం, ప్రధాని నరేంద్రమోడీ చిత్రరూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఇలా నర్సరీలలో రాముడికి పువ్వులతో అభిషేకం చేశారు. అదే విధంగా వేమగిరి తోటకు చెందిన వానంశెట్టి వెంకటేశ్వరరావు-లక్ష్మీశ్రీ దంపతుల కుమారుడు సాత్విక్ అయోధ్య శ్రీరామ మందిరం ఆకృతిని అందంగా చిత్రీకరించాడు.. ఉండ్రాజవరం మండలం వెలగదుర్రుకు చెందిన తాళపత్ర చిత్రకారుడు గోపరాజు తాటి మొవ్వ ఆకులతో శ్రీరాముడిని చిత్రాన్ని తయారు చేశాడు. రంగంపేటకు చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ అయోధ్యలో రాముని ఆగమనం - అవనికే ఆనందం అనే నినాదంతో శ్రీరాముడి సైకత శిల్పం రూపొందించాడు. కోరుకొండలో శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. భారీగా భక్తజనం హాజరై రామా.. రవికుల శ్యామా అంటూ కీర్తించారు.. ఇలా ఎవరికి తోచిన రీతిన వారు రాముడికి తమ గుండెల్లో ఉన్న స్థానాన్ని చూపారు.. - కడియం

రేపు రాజమహేంద్రవరంలో ఆటోలు బంద్

ఉచిత బస్ ప్రయాణం హామీని వ్యతిరేకిస్తూ నిరసన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21 : మహిళలకు ఉచిత బస్ సౌకర్యం హామీని వ్యతిరేకిస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోల బంద్ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్(బాక్సుప్రసాద్) తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం సెంటర్ వరకు మౌన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. బంద్‌లో అన్ని ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొంటారని తెలిపారు. బంద్ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరంలో ఆటోలు తిరగవన్నారు.అసౌకర్యానికి ప్రజలు సహకరించాలన్నారు.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.2.4 లక్షలు



నిడదవోలు, జనవరి 21 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మను ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన చేశారు. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శిం చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కలగ జేశారు.అమ్మవారికి ఆదివారం మొత్తం రూ.2,40,720లు ఆదాయం లభిం చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.

డ్వామా ఇన్‌చార్జి పీడీగా ముఖలింగం



రాజమహేంద్రవరం రూరల్, జనవరి 21 : డ్వామా ఇన్‌చార్జి పీడీగా ఎ.ముఖలింగం ఆదివారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరంలో అసిస్టెంట్ డైరెక్టర్ డీఈఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు.ఇప్పటి వరకు పీడీగా బాధ్యతలు నిర్వహించిన జగదాంబ కత్తిపూడి క్లస్టర్ ఏపీడీగా బదిలీ అయ్యారు. పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఈయన బాధ్యతలు నిర్వహించనున్నారు.పలువురు సిబ్బంది అభినందించారు.

జక్కంపూడి కుటుంబంలో జగన్ చిచ్చు!

రాజా ఆశలపై నీళ్లు.. గణేశ్‌కి కొత్త ఆశలు?

- రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా రాజా
- రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా గణేశ్
- ఊరూవాడా సాగుతున్న ప్రచారం
- సన్నిహితుల వద్ద వాపోతున్న కుటుంబీకులు
- వైసీపీలో కొనసాగుతున్న టిక్కెట్..ఇక్కట్లు
- డాక్టర్ గూడూరి, చందన పరిస్థితేంటో..
- మరో 3 నియోజకవర్గాల్లో ఇంకా టెన్షన్



జక్కంపూడి రాజా



జక్కంపూడి గణేశ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్ వైఖరితో వైసీపీ నేతలు బెంబేలెత్తుతున్నారు. బలమైన నేతలమనుకునే వారిని కూడా వైసీపీ అధిష్ఠానం ముప్పుతిప్పలు పెడుతోంది. ఇంతవరకూ ప్రతిపక్షాలు, వ్యతిరేకులకే వేధింపులు ఉన్నాయనుకుంటే ఇవాళ వైసీపీ నేతలకు కూడా ఒక విధమైన వేధింపులు తప్పడంలేదు. జిల్లాలో ఇప్పటి వరకూ ఇద్దరు బీసీ నేతలు,ఇద్దరు ఎస్సీ నేతలకు స్థానభ్రంశం కలిగించి వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసిన అధిష్ఠానం బలంగా ఉన్నామనుకున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబంలో కూడా చిచ్చు పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాయలసీమ పెత్తందారీ విధానం ఈ ప్రాంతంలో కూడా ప్రయోగిస్తున్నారు. కడప, రాయలసీమ జిల్లాల్లో నాయకుడిగా ఉన్న వ్యక్తి ఆయా గ్రామాలు, ఆయా కుటుంబాలు కూడా ఎప్పుడూ కలవనీయకుండా మంట రాజేస్తూ మొత్తం అందరినీ తన గుప్పెట్లో పెట్టుకుంటారనే ప్రచారం ఉంది. అదే విధానం ఇక్కడ కూడా కొనసాగుతోంది. ఎవరికి వారిని వేర్వేరుగా ప్రోత్సహిస్తున్నట్టు నటిస్తూ రాజకీయాల మధ్య సఖ్యత ఉండనీయ డంలేదనే విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబంలో కూడా చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కుటుంబం కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉండేది. ఎందుకంటే జక్కంపూడి రామ్మోహనరావు వైఎస్‌కు వీరవిధే యుడిగా ఉండేవారు.ఈ నేపథ్యంలో వైసీపీ వచ్చాక జక్కంపూడి కుటుంబం అందులో చేరింది. మొదట జక్కంపూడి రామ్మో హనరావు సతీమణి జక్కంపూడి విజయలక్ష్మికి 2014లో రాజానగరం టికెట్ ఇచ్చారు.ఆమె ఓడి పోయారు. కానీ 2019లో ఆమె పెద్దకొడుకు జక్కంపూడి రాజాకు టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. ఆయనతో పాటు ఆయన సోదరుడు జక్కంపూడి గణేశ్ వైసీపీ యూత్ వింగ్‌లో కీలకంగా ఉన్నారు. విజయలక్ష్మి కూడా పార్టీకార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తుంటారు. రాజానగరం సీటు మళ్లీ తనదేనని నమ్మకంతో నియోజకవర్గంలో పార్టీపనిలో నిమగ్నమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరం ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని అధిష్ఠానం ప్రతిపాదించనట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ఆయన తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇంతలో రాజాను ఎంపీగా పోటీ చేయించడంతో పాటు గణేష్‌ను రాజానగరం నుంచి పోటీకి దింపుతామని కూడా అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.ఈ కుటుంబ సభ్యులొకరు ఈ విషయాన్ని సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈ కుటుంబానికి ఫ్యామిలీ ప్యాక్ ఇస్తారా లేదా కుటుంబంలో చిచ్చు పెడతారా అనే అనుమానాలు క్యాడర్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ,ఒక లోక్ సభ నియోజకవర్గం ఉంది. ఇప్పటికే నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే.రామచంద్రపురం నుంచి మంత్రి చెల్లుబోయిన వేణుకు స్థానభ్రంశం కలిగించి రాజమహేంద్రవరం రూరల్‌కు, ఎంపీ భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తప్పిం చి రాజమహేంద్రవరం సిటీకి, మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి తప్పించి గోపాలపురం నియోజకవర్గానికి, అక్కడి ఎమ్మెల్యే తలారి వెంకట్రావును తప్పించి కొవ్వూరు నియోజకవర్గానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.దీంతో ఆయా నియోజకవర్గాల్లో వారి అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొవ్వూరులో ఇప్పటికే పలువురు గ్రామశాఖ అధ్యక్షులు పదవులకు రాజీనామా చేశారు. పరిస్థితి ఇలా ఉంటే మిగతా మూడు నియోజకవర్గాల్లో రాజానగరం, అనపర్తి, నిడదవోలు ఉన్నాయి. రాజానగరంలో ప్రస్తుతం అధిష్ఠానం ఓ ప్రయోగం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మిగతా రెండు స్థానాలపై కూడా లోపాయికారిగా అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. కానీ అధిష్ఠానం నిర్ణయం ఏంటో ప్రకటించే వర కూ ఈ టెన్షన్ తప్పదు. మరో ప్రక్క లోక్‌సభ స్థానం బీసీలకు ఇస్తామని ఆశపెట్టి పలువురిని లైన్‌లో పెట్టారు.వారిలో ఇద్దరి నుంచి కోఆర్డినేటర్ పదవులు వెనక్కి లాగేసుకున్న సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం ఎంపీ టిక్కెట్ గూడూరు శ్రీని వాస్‌కు దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. అయితే రాజాకు ఎంపీ టిక్కెట్ ఇస్తే మరి గూడూరి పరిస్థితి ఏమిటనే సంశయం నెలకొంది. మరో కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సంగతి తేలలేదు. ఇలా వైసీపీలో అంతా అయోమయంగా ఉంది.

కోడి కత్తి కేసులో కోర్టుకెందుకెళ్లవు?

జగన్ తీరుపై మండిపడిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : కోడికత్తి దాడి కేసులో జగన్ నువ్వెందుకు కోర్టుకెళ్లడంలేదు.ఎందుకు వాంగ్మూలం ఇవ్వడం లేదు. ఐదేళ్లుగా అమాయకుడైన దళిత యువకుడిని జైలు నుంచి బయటకు రాకుండా చేశావని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. తన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నీకుట్ర రాజకీయాలు బయటకు వస్తాయనే భయంతోనే కోర్టు ఎన్ని సార్లు పిలిచినా వెళ్లడం లేదన్నారు.చిన్న కేసులో ఐదేళ్లకు కూడా బెయిల్ రాదా? డ్రైవర్‌ను హత్యచేసిన ఎమ్మెల్సీని కాపాడతావు.. మాస్కు అడిగిన డాక్టర్‌ను హింసిస్తావు, శిరోముండనం కేసులో దోషులను కాపాడతావు.నీవు దళిత ద్రోహివని మండిపడ్డారు. జగన్‌ను ఇంటికి పంపితే కానీ ఏపీ అభివృద్ధిలోకి రాదన్నారు. ఆంధ్రా నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహంతో రాజకీయం చేస్తున్నావని.. ఆయన పేరు తలచుకోవడానికి కూడా నీవు పనిచేయవని దుయ్యబట్టారు. ప్రభుత్వం మారిన వెంటనే నీపై విచారణ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.



కులగణనకు సర్వర్ కష్టాలు

సచివాలయ సిబ్బంది,వలంటీర్లకు తప్పని కుస్తీ

గోపాలపురం, జనవరి 21: కుల గణన సర్వేకు సర్వర్ కష్టాలు తప్పడం లేదు. ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన ప్రారంభించారు. 28వ తేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. అయితే గత మూడు రోజులుగా సర్వర్ పనిచేయక రేయింబవళ్ళు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు లక్ష్యాన్ని అధిగమించేందుకు నానాతంటాలు పడుతు న్నారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కులగణన బాధ్యతను అప్పగించారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి ముగ్గురు లేదా నలుగురు వలంటీర్లను అప్పగించి ఈ నెల 28వ తేదీలోపు కులగణన పూర్తి చేయాలంటూ హుకుంజారీ చేశారు. అయితే పగటిపూట సర్వర్ పని చేయకపోవడంతో ఉన్నతాధికారుల ఒత్తిళ్ళ భయంతో తమకు ఇచ్చిన లక్ష్యాన్ని రాత్రయినా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బంది సమయానికి మించి పనిచేస్తున్నారు. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో మూడు రోజులకు కేవలం 18శాతం మాత్రమే కులగణన జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.గతంలో కులగణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు అప్పగించడంతో వారి నైపుణ్యంతో సమర్థవంతంగా పని చేసి లక్ష్యాన్ని అధిగమించే వారు.. రాష్ట్ర ప్రభుత్వం అనుభవమే లేని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి బాధ్యత అప్పగించడంతో ఆపసోపాలు పడుతున్నారు. కులగణన సర్వేపై సరైన అవగాహన లేక కుస్తీలు పడుతున్నారు.

నెలాఖరున నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం

7



టూటౌన్ పోలీసుల అదుపులో ఉన్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

ఛలో విజయవాడను భగ్నం చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను కదలనివ్వడం లేదు.. దీక్షలు చేయనివ్వడంలేదు.. హామీలు అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతూనే ఉంది. ఎస్మా చట్టాన్ని ప్రయో గించడంతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా అంగన్ వాడీలు బెదరలేదు..దీంతో శనివారం అధికారులు బెదిరింపులకు దిగారు.వస్తే ఉద్యోగం లేకపోతే మీ ఇష్టం అంటూ భయపెట్టారు. దీంతో తాడేపేడో తేల్చుకోవాలని ఛలో విజయవాడకు పిలుపు ఇచ్చారు. తాడేపల్లిలో జగన్ ఇంటిని ముట్టడించాలని తలంచారు.ఈ నేపథ్యంలో విజయవాడ బయలుదేరిన అంగన్వాడీలను రైల్వేస్టేషను, ఆర్టీసీ బస్టాండ్లలో పోలీసులు అడ్డుకున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషనుకు చేరుకున్న రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, సీతానగరం, కోరుకొండకు చెందిన 31 మంది అంగన్వాడీలను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషనుకు తరలించారు. కౌన్సెలింగ్ చేసిన తర్వాత వారి వివరాలు నమోదు చేసుకొని సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ టీ.గణేశ్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 10మంది వరకూ అంగన్వాడీలను అదుపులోకి తీసుకొని ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లారు.ఛలో విజయవాడకు అనుమతి లేదని.. అందువల్ల వెళ్లడానికి వీల్లేదని చెప్పి సొంత పూచీకత్తుపై పంపించేశారు.

ప్రయాణ ప్రయాస!



ఎక్కడానికి కూడా ఖాళీ లేకుండా ఉన్న రైలు

ఎక్కలేం.. దిగలేం

- కిటకిటలాడిన రైళ్లు..బస్సులు
- ముగిసిన సంక్రాంతి సెలవులు
- ఊళ్లకు పయనమైన జనం
- రైళ్లలో బాత్‌రూమ్‌లు ఖాళీలేవ్
- ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం
- నేడు రద్దీ ఉంటుందని సమాచారం

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందడి ముగిసింది.. గత బుధవారం ముక్కనుమతో సంక్రాంతి పండుగ ముగిసింది. అయితే గురువారం అందరూ తిరుగుముఖం పడదామనుకునే లోపునే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల సెలవులను 21వ తేదీ వరకూ పొడిగించింది. దీంతో ఎక్కడివారు అక్కడే ఆగిపోయారు. ఆదివారంతో సెలవులు ముగియడంతో అంతా సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో తిరుగు ప్రయాణాల రద్దీ ఎక్కువైంది. రైళ్లన్నీ కిక్కిరిసి నడుస్తున్నాయి. పశ్చిమబంగ్లా, అసోం వైపు నుంచి వచ్చే రైళ్లలో కాలు పెట్టడానికి వీల్లేకుండా బోగీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. జనరల్, రిజర్వేషను బోగీల్లో సామర్థ్యానికి మించి మూడింతల ప్రయాణికులు ఉంటున్నారు. దీంతో ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. రిజర్వేషను బోగీల్లో ఒక కూపేకు ఎనిమిది మందికి సీట్లు/బెర్తులు కేటాయిస్తారు. కానీ ఒక్కో కూపేలో తక్కువంటే 20 మంది ప్రయాణికులు ఉంటున్నారు. దీనికి సంబంధించి రైల్ మదద్‌కి రోజూ ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆహార పదార్థాల తర్వాత స్థానంలో ఈ ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్పీఎఫ్ పోలీసులు, టీటీఈలు బోగీ వద్దకు వెళ్లి క్లియర్ చేయించినా రైలు బయలుదేరగానే మళ్లీ పరిస్థితి మొదటికి వస్తోంది. రిజర్వేషను బోగీల్లో టిక్కెట్లు చెక్ చేయడానికి టీటీఈలకు నరకం కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా సిల్చార్, సిల్ఘాట్, గువాహటి వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు ఎప్పుడూ విపరీతమైన రద్దీతో నడుస్తుంటాయి.ఇప్పుడు పండుగ తిరుగు ప్రయాణాల సందర్భంగా బోగీలు పూర్తిగా నిండిపోతు న్నాయి. ప్రమాదకరం అని తెలిసినా బోగీ ద్వారాలకు వేలాడుతూ మరీ ప్రయాణించాల్సి వస్తోంది. మహిళలు ఇలానే ప్రయాణిస్తున్నారు.రాత్రి వేళల్లో రైలు వెళ్తున్న సమయంలో హోరున వీచే చలికి ద్వారాల వద్ద ప్రయాణికుల చేతుల్లో స్పర్శ నెమ్మదించి పట్టుకోల్పోయి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకసారి బోగీలోనికి వెళ్తే దిగేవరకూ కాలు కదపడానికి నానా తంటాలూ పడుతున్నారు. దిగే సమయంలో కూడా నరకం చూస్తున్నారు.బాత్‌రూమ్‌లలో కూడా ప్రయాణికులు ఉంటున్నారంటే రైలు ప్రయాణం ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎక్కువగా తిరుగు ప్రయాణాలు విజయవాడ, బెంగళూరు,చెన్నై, హైదరాబాద్, వైజాగ్, భువనేశ్వర్‌కి ఉంటాయి. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడం, రద్దీని గమనించి రైళ్లు నడపలేకపోవడంతో దగ్గరి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నలిగిపోతున్నారు. దగ్గరి ప్రాంతాల ప్రయాణకుల డిమాండ్ ఎక్కువగా ఉండే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లనూ రద్దు చేయడం ప్రయాణికులకు మరింత ముప్పుగా మారింది. విజయవాడ, తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు, తుని, సామర్లకోట, విశాఖ వెళ్లే ప్రయాణికులు ఏ రైలు ఎక్కాలో అర్థంకాని పరిస్థితుల్లో ఏదోక రైలు ఎక్కి బతుకుజీవుడా అంటూ గమ్యస్థానంలో దిగుతున్నారు. సుదూర ప్రాంతాలను కలిపే రైళ్లలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వరకూ రిజర్వేషను చేయించుకున్న ప్రయాణికులు ఆ బోగీలు ఎక్కలేక.. జన్మభూమి వంటి ఇంటర్‌సిటీల్లో కాలు పెట్టడానికీ వీలులేక తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రద్దీ కొనసాగుతున్నా ఉన్న రైళ్లనూ రద్దు చేస్తుండడంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు.రైల్వే అధికారులు సాంకేతిక తదితర కారణాలు చూపడం ఇటీవల కాలంలో షరా మామూలే అయినా తమతో ప్రయాణిస్తే ప్రయాణ హింస ఏమిటో అర్థం అవుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుగు ప్రయాణికుల వల్ల రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా బాగానే ఆదాయం సమకూరింది. సాధారణ రోజుల్లో 3 నుంచి 4 వేల మంది సాధారణ టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రయాణిస్తుంటారు.ఈ ఐదు రోజుల్లో ఆ సంఖ్య పది వేలకు చేరగా రోజుకు ఆదాయం సరాసరి రూ.12లక్షలు దాటింది. రిజర్వేషను ప్రయాణికులను కలుపుకొంటే రోజుకు రాకపోకలు సాగించే వారి సంఖ్య 20 వేల వరకూ ఉంది. బస్టాండ్ కూడా కిటకిటలాడింది. బస్ ఎక్కడానికి కూడా ఖాళీ లేకుండా ఉంది. ప్రయాణికులతో ఉదయం నుంచి బస్టాండ్ కిటకిటలాడింది. సోమవారం కూడా రద్దీ ఉంటుందని ఆర్టీసీ జిల్లా అధికారులు చెబుతున్నారు.



మోతుగూడెం రహదారులపై కమ్మేసిన పొగ మంచు

మంచు ముసుగు..

మోతుగూడెం, జనవరి 21: చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో ఉదయం సాయంత్రం వేళలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. ఉదయం 10గంటల వరకు భానుడు కనిపించడంలేదు. ఎదు రుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు లైట్లు వెలుగులో రాకపోకలు సాగించారు. కొంతమంది ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో బంధించారు.

31న ఆదికవి నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం

» గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా పట్టాల ప్రదానం

» పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

రాజానగరం, జనవరి 21: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 31న నిర్వహించ నున్నట్టు వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తెలిపారు. ఇందు కు సంబంధించిన ఏర్పాట్లను చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నన్నయ వర్సిటీ.. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, మన్యం(సగభాగం)జిల్లాల్లోని 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వ విద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకో త్సవం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లమో, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేయనున్నారు. 13, 14, 15 స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్‌మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. వీరందరికీ గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. మరో ముఖ్యఅతిథి భారతీయ సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్, పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండుగలా నిర్వహించేందుకు వర్సిటీ అధ్యాపకులు, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వీసీ కోరారు.

'నన్నయ' స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయంలో ఈనెల 31న జరుగనున్న స్నాతకోత్సవానికి విధిగా రావాలంటూ వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయంలో అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. నన్నయ వర్సిటీలో స్నాతకోత్సవానికి విచ్చేసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయాలని ఈ సందర్భంగా కోరినట్టు వీసీ తెలిపారు.



ఈవో రామచంద్రమోహన్‌కు విరాళం అందజేస్తున్న దాత శివకుమార్

సత్యదేవుడి సన్నిధిలో
శివసదన్ కాటేజీకి రూ.20 లక్షల విరాళం

అన్నవరం, జనవరి 21: అన్నవరం దేవస్థానంలో సత్యగిరికొండపై నిర్మించిన శివసదన్ కాటేజీలో డోనార్‌స్కీం ద్వారా ఒక దాత రెండుగదులకు రూ.20 లక్షలు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్.శివకుమార్ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. రెండు గదులను చెట్టుపల్లి అప్పారావు, చెట్టుపల్లి పుష్ప అప్పారావు పేరున దాత చెల్లించారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

అమ్మ కరుణ కోసం బడిత పూజ



అమ్మ కరుణ కోసం పూజారులతో బడిత పూజ చేయించుకుంటున్న భక్తులు

- ఎగబడిన భక్తులు
- నాగదేవతకు భక్తి శ్రద్ధలతో పూజలు
- దేవతామూర్తుల వేషధారణలతో ఇంద్రలోకాన్ని తలపించిన కొప్పవరం
- వైభవంగా సత్తెమ్మ జాతర ఉత్సవాలు

అనపర్తి, జనవరి 21: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని కర్రి వారి సతెమ్మతల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తమ గ్రా మానికి వచ్చిన అమ్మవారు పుట్టవద్దకు వెళ్లి అంతర్ధానమైందని అక్కడ నాగ దేవతగా అవతరించిందని ఇక్కడ భక్తుల నమ్మకం. ఈ ఆచారం ప్రకారం విచిత్ర వేషాలు ధరించిన భక్తులు గ్రామ పొలిమేరలోని పాములపుట్ట వద్దకు చేరుకుని నాగదేవతకు పాలుపోసి పూజలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం జరిగిన జాతరలో అమ్మవారికి మొక్కుకుని సంతానం పొందిన మహిళలు తమ చిన్నారులకు వేషాలు వేయించి పుట్ట వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. పుట్ట వద్దకు వెళ్లే రహదారి అంతా విచిత్ర వేషధారులతో నిండిపోయింది. అనంతరం భక్తులంతా ఊరేగింపుగా అమ్మవారి ఆలయంవద్దకు చేరుకుని పూజారితో బడిత పూజకు సిద్ధమయ్యారు. ఆలయం ప్రాంగణానికి చేరుకున్న విచిత్ర వేషాల్లో ఉన్న భక్తులు పూజారి బయటకువచ్చి తమను ఆశీర్వదించాలని కేకలు వేయడంతో పూజారులు చేతిలో బడిత పట్టుకుని భక్తుల వద్దకు వచ్చారు. ఇలా వచ్చిన పూజారులను భక్తులు అల్లరిచేసి కోపం రప్పించడంతో ఆగ్రహించిన పూజారులు బడితలతో భక్తులను కొట్టడం ప్రారంభించారు. బడిత పూజ చేయించుకుంటే అమ్మ తమను కరుణిస్తుందని భక్తుల విశ్వాసం. పుట్ట వద్దకు వెళ్లేందుకు రకరకాల వేషాలు ధరించిన భక్తులు మోటారుసైకిళ్లపై తిరుగుతుండడంతో ఊరంతా కొత్త వాతావరణం ఏర్పడింది. కోయదొరలు, శక్తివేషాలు, పురుషులు మహిళలుగాను, చిన్నారులు ఈశ్వరుడు, శ్రీకృష్ణుడు అనేక రకాల వేషాలతో ఆకట్టుకున్నారు.





దర్శనానికి వచ్చిన గోల్డ్‌మేన్, అమ్మ కరుణతో పుట్టిన చిన్నారి చిన్న కారులో వచ్చిన దృశ్యం



నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొక్కులు చెల్లించేందుకు నేడు భక్తుల భిక్షాటన

సత్తెమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునే భక్తులు సోమవారం జరిగే జాతరలో విచిత్ర వేషాలు ధరించి భిక్షాటన చేసేందుకు సిద్ధమయ్యారు. తమ దగ్గర ఉన్న తులమో పళమో అమ్మవారికి సమర్పించుకోవడం ఇక్కడ నిషేధం కాబట్టి మొక్కులు తీర్చుకునే భక్తులు జాతరలో విచిత్ర వేషం ధరించి భిక్షాటన చేయాల్సిందే.. ఇలా వచ్చిన మొత్తాన్ని అమ్మకు చెల్లిస్తేనే మొక్కు తీరుతుంది.

తలుపులమ్మా.. కరుణించమ్మా..

- భక్తులతో పోటెత్తిన లోవ
- ఆలయానికి రూ.4.98 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 21: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ అనంతరం పూజలు నిర్వహించి పండితులు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.98లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ రాజు తెలిపారు.





భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

రెండోరోజు కొనసాగిన
లాన్‌టెన్నిస్ పోటీలు



పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న ఏడీ రాజశేఖర్

కాకినాడరూరల్, జనవరి 21: కాకినాడలో 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు ఈనెల 24వరకూ కొనసాగనున్నాయని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్పోర్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుకగల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. ఆదివారం మొత్తం 9మ్యాచ్‌లు నిర్వహించగా మహారాష్ట్ర, కేంద్రీయ విద్యాలయం జట్లమధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 2-1 స్కోర్‌తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా హర్యానా జట్టు తెలంగాణా జట్టుపై 2-0తో విజయం సాధించింది. ఢిల్లీజట్టు రాజస్థాన్‌పై 2-0తేడాతోనూ, ఏపీజట్టుపై గుజరాత్‌జట్టు 2-0తేడాతోనూ విజయం గెలుపొందింది. హర్యానాజట్టు మహారాష్ట్రపై 2-1స్కోర్‌తేడాతో విజయం సాధించిందని తెలిపారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పులయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీడీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు పర్యవేక్షిస్తున్నారు.



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

జాతీయ పోటీలకు 30మంది క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, జనవరి 21: పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఫ్రీస్టైల్, గ్రేకో రోమన్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 16 జిల్లాలు నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 30మంది క్రీడాకారులను జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 30, 31వ తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయ పోటీలకు వీరు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. పోటీల్లో విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు, మెడల్స్ అందజేశారు. పోటీలను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గు బ్బల ఎలీషా పర్యవేక్షించగా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో చంద్రు గోవింద రాజులు, ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలరావు, పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, సత్యనారాయణరెడ్డి, డీఎస్‌డీవో బి.మాణిక్యాలరావు, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి పాల్గొన్నారు.



రాజోలులో కలుసుకున్న 1969 నాటి పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

రాజోలు, జనవరి 21: బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో జరిగింది. 1969లో ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బందా సూర్యనారా యణ చొరవతో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న మాట్లాడుతూ ఆరేళ్లుగా స్నేహితులందరూ కలుసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థులకు బిళ్లకోట సోమేశ్వరరావు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో నయినాల సీతారామారావు, సూతాపల్లి అచ్యుత రామ నాగేశ్వరరావు, ఎస్.మాదవరావు, ఎం.మోహనరావు, అంగర సత్యనారాయణ, టీవీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు



సామర్లకోట, జనవరి 21: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ కారిడార్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈనెల 29 నుంచి విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే ఏటీఎం చార్జి ఏ.సురేష్‌రెడ్డి సామర్లకోట రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఆంధ్రజ్యోతి సదరు సమాచారాన్ని ఆదివారం రాత్రి సేకరించింది. నెం.13351 ధన్‌బాద్-అలెప్పీల మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29నుంచి ఫిబ్రవరి 25 వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.12835 హతియా-బెంగుళూరుల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30న, ఫిబ్రవరి 4,6,11,13,18,20,25 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. నెం.18637 హతియా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,17,24 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.22837 హటియా-ఎర్నాకుళం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29, ఫిబ్రవరి 5,12,19 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.18111 టాటా-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 1,8,15,22 తేదీల్లో నిడద వోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. నెం.12756 భావనగర్-కాకినాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 3,10,12,19 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరంటౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.12509 బెంగుళూరు-గౌహతి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 31, ఫిబ్రవరి 2,7,9,14,16,21,23 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. నెం.11019 ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29,31, ఫిబ్రవరి 2,3,5,7,9,10,12, 14,16,17,19,21,23,24 తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నిడదవోలు చేరుతుంది. వివరాలకు సమీపంలోని రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని సీనియర్ ఏటీఎం చార్జి ఏ.సురేష్ రెడ్డి తెలిపారు.

మేడివాయిలో
పెట్రోల్ బంకు కూల్చివేత

- ఆ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు.. రెండు సార్లు నోటీసులు
- ఖాతరు చేయకుండా నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు



బంకు నిర్మాణ పనులను కూల్చివేస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 21 మండల కేంద్రమైన ఎటపాక సమీపంలోని మేడివాయిలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న పెట్రోలు బంకు కట్టడాలను శనివారంరాత్రి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు బంకు నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ భూమిపై గతంలో ఎల్టీఆర్ కేసు నమోదై ఉందని, తహసీల్దార్ పృధ్వీ తెలిపారు. ఎల్టీఆర్ ఉండగా ఎలాంటి నిర్మాణాల పనులు చేపట్టకూడదని గతంలో హెచ్చరించామని తెలిపారు. ఇటీవల భూమిపై అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకొంటున్న ఓ వ్యక్తి ఎల్టీఆర్ ఖాతరు చేయకుండా బంకు నిర్మాణ పనులుచేస్తూ ఉండ డంతో రెవెన్యూ అధికారులు గత అక్టోబరులో, ఈనెల 2 తేదీన ఆ వ్యక్తికి నోటీసు అందజేశారు. అయినా లెక్కచేయకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తూ ఉండ డంతో కలెక్టర్ ఆదేశాలతో కట్టడాలపై చర్యలు తీసుకున్నారు. బంకు నిర్మాణం చేపడుతున్న వ్యక్తి ఈభూమిపై జీవో తెచ్చుకున్నారని, ఆ జీవోను న్యాయ స్థానంలో సవాలు చేయగా రద్దు చేసి ఆర్డీవో స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ తెలిపారు. ఏజెన్సీలో ఉన్నటువంటి ఈ భూమిపై గిరిజనేతరులు చెల్లని డాక్యుమెంట్లతో మ్యూటేషన్ చేయించుకున్నారని, అవి చెల్లదని దాంతో నిర్మాణాలను కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

రౌతులపూడిలో
యానాం మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

రౌతులపూడి, జనవరి 21: కాకినాడజిల్లా రౌతులపూడిలో పోలీస్‌లు అక్రమంగా నిల్వఉంచినయానాం మద్యం పట్టుకున్నారు. రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాలు ప్రకారం.. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు... పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాలతో ఒక వ్యక్తి నుంచి 192 బీర్లు, 180 ఎమ్ఎల్ విస్కీ 129 సీసాలు, 375 ఎమ్ఎల్ విస్కీ 45 సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అలాగే రౌతులపూడి వంతెనపై 30 లీటర్లు సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

వైసీపీ నాయకుల జేబులు నింపేందుకే
ఇసుక ర్యాంపుల్లో అనధికార వసూళ్లు

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రెండోరోజు లారీ అసోసియేషన్ సభ్యుల నిరసన

రావులపాలెం, జనవరి 21: ఇసుక ర్యాంపులో అనధికారకంగా చేస్తున్న వసూళ్లు వైసీపీ నాయకుల జేబులు నింపేందుకా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో ఉభయగోదావరిజిల్లాల లారీ అసోషియేషన్ సభ్యులు రెండో రోజు కార్యక్రమం ఆదివారం కొనసాగించారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆరు టైర్ల లారీకి రూ.1000, పది టైర్ల లారీకి రూ.1500, పన్నెండు టైర్ల లారీకి రూ.2000వంతున ఇసుక ర్యాంపుల్లో అక్రమ వసూళ్లు చేస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ లారీ అసోషియేషన్ సభ్యులు నిరసన చేపట్టారు. గోపాలపురం ఇసుక ర్యాంపులో చేపట్టిన నిరసనలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ రాష్ట్రతెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ టీడీపీ నాయకులతో కలిసి అక్కడికి వెళ్లిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల లారీ అసోషియేషన్‌కు టీడీపీ అండగా ఉండి దోపిడీ అడ్డుకుంటామన్నారు. ర్యాంపులో ఇసుక లారీ ఓనర్స్ దగ్గర బాటచార్జీల పేరుతో వైసీపీ రౌడీమామూళ్లు అని ప్రశ్నించారు. అనధికారిక వసూళ్లు వైసీపీ నాయకులు జేబులు నింపేందుకే అన్నారు. చట్టపరమైన, కనీసం పర్యావరణ అనుమతులు కూడా లేకుండా అక్రమంగా ఇసుక తవ్వడం దారుణమన్నారు. అంతేకాకుండా బాట చార్జీలపేరుతో వైసీపీ వసూళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి దండుకుంటుందన్నారు. ఈ ఇసుకాసురుల ఆగడాలను లారీ ఓనర్స్ అసోషియేషన్స్‌తో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, నాయకులు అధికారి నాగు, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లారీ అసోసియేషన్ సభ్యుల నిరసనకు బండారు సంఘీభావం

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

- మృతుడు కాకినాడ వాసి




ఉదయ్‌కుమార్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్, జనవరి 21: అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరం శివారు పిల్లోడుపాలెం సమీపంలో గల చెరువుగట్టు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడజిల్లా జగన్నాథపురంలోని రిక్షా వీధికి చెందిన కాకి ఉదయ్‌కుమార్(20) రెండు రోజుల క్రితం చోడపల్లిలోని తన చెల్లి, బావ ఇంటికి వచ్చాడు. అక్కడ ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం సమీపంలోని పిల్లోడిపాలెంలో గల బంధువుల ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలు దేరాడు. అయితే అక్కడికి సమీపంలోని చెరువు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఆపి అక్కడేఉన్న చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. గ్రామస్థులు సమా చారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వచ్చి మృతుని జేబులో ఉన్న అడ్రస్ కాగితం ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

తేటగుంట శివాలయంలో దొంగల బీభత్సం

- హుండీల్లో నగదు, బంగారు ఆభరణాల చోరీ





దుండగులు దొంగలించిన హుండీ, ధ్వంసం చేసిన సీసీ కెమెరాల కిట్టు

తునిరూరల్, జనవరి 21: వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తిస్తున్నారు. ఏడాది కాలంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న తేటగుంట గ్రామంలో పలు ఆలయాల్లో దేవతామూర్తుల బంగారం, వెండి ఆభరణాలు, హుండీల చోరీ ఘటనలు మరువక ముందే ఆదివారంరాత్రి దుండగులు ఆలయాల్లో బీభత్సం సృష్టించారు. మెట్టలో ప్రసిద్ధి ఆలయమైన తేటగుంట శివాలయంలో దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాలకు ఉన్న తాళాలు పగలకొట్టి గుడిలోకి ప్రవేశించి సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు ధ్వంసం చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడి తలుపులను తొలగించి అమ్మవారి మెడలోని మంగళసూత్రం, హుండీలను చోరీ చేశారు. అదేవిధంగా శివాలయం ప్రక్కనే గల సాయిబాబా ఆలయంలో ఈ తరహాలోనే చోరీకి పాల్పడిఅక్కడహుండీలోని నగదును అపహరించారు. దీంతో స్వామి వారి మేలుకొల్పు పూజకు ఆలయాలకు వెళ్లిన అర్చకులు చెల్లా చెదురుగా ఉన్న వస్తువులను చూసి ఖంగుతిన్నారు. దీంతో ఆలయ కమిటీలకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామంలో వరుస దొంగతనాలతో ఆలయాలకు రక్షణ కరువైందని రెండేళ్లలో శివాలయంలో మూడుసార్లు ఆలయంలో దొంగలు ప్రవేశించి ఆలయ సంపదను చోరీ చేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు చేపట్టి దొంగలను పట్టుకుని ఆలయాలకు రక్షణ కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.

ఏజెన్సీ సమాచారం

పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి దృశ్యం

మోతుగూడెం, జనవరి 21: చింతూరు మండలం మోతుగూడెం సంక్రాంతి సెలవులు, ఎగస్ట్రా సెలవులు రావడంతో పర్యాటక ప్రాంతమైన జలపాతాలు, డ్యామ్‌లు, వ్యూపాయింట్, పిక్నిక్ స్పాట్లు పర్యాటకులతో సందడిగా మారాయి. శని, ఆదివారాల్లో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ అందాలను తనవితీరా ఆస్వాదించి ఆనందంలో మునిగిపోయారు. మైదాన ప్రాంతం నుంచి వందల్లో పర్యాటకులు చేరుకుని లాడ్జిల్లో నుంచి తెల్లవారుజామున మేఘాలు చీల్చుకుంటూ ఉదయించే భానుడు అందాలు తిలకించారు. మరో ప్రక్క ఫోర్‌బాయ్ మేఘాల కొండలను చూసేందుకు వచ్చిన జనాలతో ఆ రోడ్లో కిలోమీటరు వాహనాలు నిలిచిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మోదీ, జగన్ ప్రభుత్వాలపై ఉద్యమించాలి

● రంపచోడవరంలో లెనిన్ 100వ వర్ధంతి సభ



లెనిన్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న టాన్యా

రంపచోడవరం, జనవరి 21: దేశంలో మోదీ, రాష్ట్రం లో జగన్ ప్రభుత్వాలపై లెనిన్ తరహా ఉద్యమాలను సాగించాలని, ప్రజలందరూ లెనిన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని న్యూడెమోక్రసీ కేంద్ర నాయకురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. ఆదివారం రంపచోడవరంలోని మార్క్స్ ఏంగిల్స్ భవన్‌లో జిల్లా నాయకుడు పి.లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన లెనిన్ 100 వర్ధంతి సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంలో ఆమె మాట్లాడుతూ 1917లో లెనిన్ నెలకొల్పిన కార్మిక రాజ్యం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక లోకాన్ని ఉత్తేజపర్చిందని ఆమె అన్నారు. నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజాస్వామ్యం కుంటుపడిందని, బూర్జువా పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.దూలన్న, వి.చిట్టిబాబు, కె.బాలురెడ్డి, కె.బాలుదొర, పి.అనసూయ, ఐ.రమణ, వి.భీమశంకర్, వి.వాసు, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రాములోరి ఊరేగింపు



పల్లకిలో రాములవారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

దేవీపట్నం, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముల వారి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలో ఇందు కూరుపేట తదితర గ్రామాలలో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పల్లకీల్లో శ్రీరాములవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీవారు మాట్లాడుతూ గ్రామాలలో మాంసాహారా న్ని విక్రయించకూడదని సోమవారం ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని 12 గంటల తరువాత దీపాలు వెలిగించాలన్నారు.

వీఆర్‌పురంలో తాగునీటి ఎద్దడి

వరరామచంద్రాపురం, జనవరి 21: మండల కేంద్రమైన వీఆర్‌పురంలో గత నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత సముదాయం దగ్గర నుంచి గ్రామ శివారు వరకు (వినాయకుని గుడివైపు) ఈ మోటారు ద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ఆ వైపు ఉన్న కుటుంబాల వారు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మోటారు మరమ్మతులకు గురికావడంతో మోటారును రిపేరు నిమిత్తం భద్రాచలం పంపించి నాలుగు రోజులు కావస్తున్నా, సంబం ధిత గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మ కు నీరెత్తినట్టుగా చూస్తున్నారు. ప్రజలు అంతంత మాత్రంగా పనిచేస్తున్న చేతిపంపుల దగ్గర క్యూకడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సరఫరా త్వరగా పున రుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

24న పోలవరం నిర్వాసితుల సంఘీభావ సదస్సు విజయవంతం చేయాలి

● ఏజెన్సీ గిరిజన సంఘం పిలుపు

రంపచోడవరం, జనవరి 21: ఈ నెల 24న ధవళేశ్వరంలో నిర్వహించ తలపెట్టిన పోలవరం నిర్వాసితుల సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. ఈమేరకు సంఘం గౌరవాధ్యక్షుడు ఇల్లం రామిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత ఈ సభను 22న నిర్వహించతలపెట్టినా, పలు కారణాల రీత్యా 24కు మార్పు చేశామన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తదితరులు హాజరుకానున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యే ఎజెండాగా ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు.

28న రాజమహేంద్రవరంలో హిందూ సంగమం

▸▸ కొవ్వూరులో కరపత్రాలు, పోస్టర్స్ ఆవిష్కరణ



కొవ్వూరు, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కొవ్వూరు ఖండలోని అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్టు ఖండ కార్యావాహ గోవర్ధనం శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 28న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న భారీ హిందు సంగమం కార్యక్రమానికి సంబంధించి ఆదివారం కొవ్వూరులోని పాతవూరు వరద గోపాలస్వామి ఆలయంలో కరపత్రాలు, పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. వీహెచ్‌పీ కార్యదర్శి తోరం శ్రీనివాసు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పెనకనమెట్ట, నందమూరు, పశివేదల, వాడపల్లి, మద్దూరు, మద్దూరులంక, పంగిడి, దొమ్మేరు, ఆరికిరేవుల, కుమారదేవం గ్రామాలతోపాటు కొవ్వూరు పట్టణంలోని రామాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పారాయణాలు, కల్యాణోత్సవాలు, అన్నదానాలు జరుగుతాయన్నారు. 28న అధికసంఖ్యలో భక్తులు మధ్యాహ్నం 2గంటలకు మెరకవీధి ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకుని ర్యాలీగా రాజమహేంద్రవరం వెళ్లాలని వీహెచ్‌పీ ప్రఖంగ కార్యకర్త మంగిన నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తురగా భాస్కరరామం, బాలదారి చక్రపాణి, పూల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు గోష్పదక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కొవ్వూరు గోష్పదక్షేత్రంలో పవిత్ర జీవన్ సంస్థాన్, అఖండ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6గంటలకు గోష్పదక్షేత్రంలోని కాశీ విశ్వనాథుని సన్నిధిలో దీపోత్సవం, గంగపూజ, దీపావళి నిర్వహించనున్నట్టు ఆధ్యాత్మికవేత్త పాలకోడేటి సత్యనారాయణ మూర్తి తెలిపారు. గోదావరిమాతకు 108 చీరలతో సారె సమర్పిస్తామని చెప్పారు.

చంద్రబాబు దృష్టికి నర్సరీ రైతుల సమస్యలు

కడియం, జనవరి 21: టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి నర్సరీ రైతుల సమస్యలను పార్టీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ తీసుకెళ్లారు. నర్సరీలకు కొన్ని ప్రాంతాల్లో మీటర్లు బిగిస్తున్నారని, రైతులకు పలు సమస్యలున్నాయని, టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. తెలుగుదేశం హయాంలో నర్సరీలకు ఉచిత విద్యుత్‌తోపాటు రైతులకు సోలార్ విద్యుత్, రాయితీపై పాలిహౌస్‌లు, షేడ్‌నెట్లు ఇచ్చి నర్సరీలకు అండగా నిలిచారన్నారు.

రాబోయే రోజుల్లో వైసీపీ ఖాళీ

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

గోకవరం, జనవరి 21: ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వైసీపీ రానున్న రోజుల్లో పూర్తిగా ఖాళీ అయిపోతుందని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు వైసీపీ సీనియర్ నాయకుడు గాజింగం సత్తిబాబు, ఇటికాయలవల్లి మాజీ సర్పంచ్ కండేపల్లి రాంబాబుతో పాటు సుమారు 500 మంది వైసీపీని వీడి ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి నెహ్రూ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ముందుగా గోకవరంలోని శివాలయం నుంచి నెహ్రూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యంలో అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం దేవి చౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి ర్యాలీగా కృష్ణునిపాలెం శివారు గోపికృష్ణా కల్యాణ మండపం వద్దకు చేరుకుని భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ సీఎం జగన్ మాయమాటలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత లాభం కోసం ఆరాటపడమే తప్ప నియోజకవర్గ ప్రజల మేలు కోసం ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మంత్రిగా పనిచేసిన తోట నర్సింహం కూడా నియోజవర్గానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కనీసం ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా ఒక ప్రాజెక్టును కూడా మంజూరు చేయలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, పోసిన ప్రసాద్, మండిగ గంగాధర్, ఉంగరాల గణేష్, గునిపే భరత్, స్టూడియో రాజు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

▸▸ రంగాపురంలో బీసీ జయహో సభలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



బిక్కవోలులో పూలేకు నివాళులర్పించిన బీసీ నేతలు, రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జనవరి 21: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రంగాపురంలో ఆదివారం రాత్రి బీసీ జయహో సభ నిర్వహించారు. ముందుగా మండలంలోని పందలపాక గ్రామం నుంచి ఊలపల్లి, బిక్కవోలు, ఇళ్లపల్లి గ్రామాల మీదుగా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీసీలందరూ బైక్ ర్యాలీతో రంగాపురం చేరుకున్నారు. ప్రతి గ్రామంలోని ఎన్‌టీఆర్, పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. రామకృష్ణారెడ్డికి మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టిల్లు అని, బీసీలందరూ టీడీపీ హయాంలోనే గుర్తింపు పొందారన్నారు. బీసీల నైపుణ్యం వెలికితీయడానికి టీడీపీ తీసుకువచ్చిన 30కు పైగా పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. నాసిరకం మద్యంతో మందు బాబులు కూడా మోసాలకు గురయ్యారన్నారు. వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలే నష్టపోయారని, కబ్జాలు చేసేవారికి న్యాయం చేసే ప్రభుత్వమని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక భూరక్షణ చట్టం రద్దు చేస్తామని, బీసీలకు యేటా 15వేలు కోట్లు ఖర్చు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుపూడి సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, బాలయ్య, తెనెల శ్రీనివాసు, రెడ్డి శ్రీనివాసరావు, పితాని శివరామకృష్ణ, యనమదల రాజు, కానేటి అప్పలస్వామి, గేదెల సత్యనారాయణ, రాయుడు రామచంద్రరావు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ-జనసేన ప్రభంజనమే : గోరంట్ల

కడియం, జనవరి 21: రానున్నది తెలుగుదేశం-జనసేన ప్రభంజనమే అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం మాధవరాయుడుపాలెంలో జరిగిన ఓ కార్యక్రమానికి సర్పంచ్ అన్నందేవుల చంటితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు పాడయ్యాయని, రహదారులు పాడై, ప్రతిరోజు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కనీస సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అన్నందేవుల శ్రీను, ఎంపీటీసీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు, ఉండమట్ల దుర్గారావు పాల్గొన్నారు.

కోరుకొండలో వైభవంగా జై శ్రీరామ శోభయాత్ర



అనపర్తి: రామవరంలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కోరుకొండ, జనవరి 21: సోమవారం అయోధ్యలో జరగబోయే శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం సాయంత్రం కోరుకొండలో శ్రీరామ శోభయాత్ర జరిగింది. వందలాది మంది బైక్‌లపై కషాయ పతాకాలతో గాడాల నుంచి ఊరేగింపుగా కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరారు. అలాగే శ్రీరంగపట్నం నుంచి మరో ఊరేగింపు కోరుకొండ ఆలయానికి చేరింది. ఈ రెండు కలిసి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి కాపవరం జంక్షన్, పెట్రోల్‌బంకు, సాయిబాబా గుడిమీదుగా బూరుగుపూడి గేటు, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం మీదుగా రాజానగరం, దివాన్‌చెరువు మీదుగా తిరిగి గాడాల చేరుకుంది. సుమారు 30కిలోమీటర్ల మేర జరిగిన ఈ శోభయాత్రలో బీజేపీ జోనల్ ఇన్‌చార్జ్ ఏపీఆర్ చౌదరి, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కటకం చలం, కాంగ్రెస్ మండల కన్వీనర్ గరగ శ్రీధర్‌బాబు, బి.నరసింహమూర్తి, చక్రపండు, జె.వెంకన్న, బాసా సత్యనారాయణ, బుద్దా బాపూజీ, తనకాల ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీరామ కోటి రచన



రాజానగరంలో విద్యార్థులు లిఖించిన శ్రీరామ కోటి నామ పత్రాలు

రాజానగరం, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని కానవరంలో గాయత్రి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శ్రీరామ కోటి నామాలను లిఖించారు. గాయత్రి పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని మూడు రోజుల వ్యవధిలోనే కోటి 11 లక్షల శ్రీరామ కోటి నామాలు రాశారు. ఈవిధంగా లిఖించిన రామకోటి నామ పత్రాలను నూతన వస్త్రంలో ఉంచి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మకు ఆదివారం అందజేశామని గాయత్రి కరస్పాండెంట్ వీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

అనపర్తి, జనవరి 21: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రామవరంలోని తూర్పుపేట రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. సత్తి సూరారెడ్డి కళ్యాణి దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర కోలాట బృందం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా స్థానిక మూలారెడ్డి కాలనీలో ప్రతి ఇంటికి జైశ్రీరామ్ మంత్ర ముద్రను వేస్తూ కాలనీ యువత భక్తిని చాటుకున్నారు.

రాజ్య వ్యవస్థను వాడుకుంటున్న బీజేపీ

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 21: మోదీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాజ్య వ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నారని, లౌకిక అనే పదాన్ని తొలగించేలా కుట్రలు చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని నేటి రాజకీయం-విస్తరిస్తున్న హిందూ జాతీయ వాదం అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి అయోధ్యను దేశ వ్యాప్తంగా ప్రచారం కోసం వాడుకుంటున్నారని.. దీనికి బడా పెట్టుబడిదారి వర్గం వంతపాడుతుందన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి బాటలు వేసిన లెనిన్ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సదస్సులో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నాయకులు సేపేని రమణమ్మ, బేగం, ఉమ, ఎం.సాగర్, నాగేశ్వరరావు, కొండవతి, సుజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా వాసవీక్లబ్ సేవలు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ నాగభూషణం



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21: దేశంలో కులమతాలకు అతీతంగా సేవలు అందించడమే తమ సంస్థ లక్ష్యమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ హెచ్ఎస్ నాగభూషణం చెప్పారు. గౌతమి ఘాట్ బొమ్మన రామచంద్రరావు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ హాలులో ఆదివారం జరిగిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. బి పాజిటివ్, బి క్రియేటివ్ నినాదంతో ముందుకు వెళుతున్న తమ సంస్థ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 60 ఏళ్లు దాటిన జంటలకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్ కుమార్, కేబినెట్ సెక్రటరీ జి.సురేష్, కోశాధికారి కేశవరావు, నాగప్రశాంత్, వైస్ గవర్నర్ యెండూరి రాఘవ కుమారి, నిడమానూరు శ్రీనివాస ఫణి రాజేష్, కోచైర్మన్ గ్రంధి సుజాత, రీజియన్ ఛైర్మన్లు చెక్కా సురేష్ కుమార్, సిహెచ్ వి ఎస్‌పి చంద్రగుప్తా, రాజా నాగరత్నకుమార్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ సురేశ్‌బాబు

రాజమహేంద్ర వరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని విజిలెన్స్ ఎస్పీ సురేశ్ బాబు పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన రోజున ఆ కార్యక్రమాన్ని చూడడానికి రైల్వేస్టేషన్లలో ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో రాజమండ్రి, అనకాపల్లి, తుని, కాకినాడ, నిడదవోలు, తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్లలో రాజమండ్రి విభాగానికి చెందిన రాజరాజనరేంద్ర ఓపెన్ గ్రూప్, గోదావరి ఓపెన్ గ్రూప్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు రద్దీని నియంత్రించడం తది తర సేవలందించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీరామమూర్తి, సహాయ జిల్లా కమిషనర్ దాడి ప్రసాద్, స్కౌట్ మాస్టర్లు హెచ్ఎం ఎస్.రాజ్‌పుత్, ఎస్‌వీ వీరభద్రరావు పాల్గొన్నారు.

తలుపులమ్మ తల్లికి ప్రముఖుల పూజలు

కోరుకొండ, జనవరి 21: కోరుకొండ దేవుని కోనేటి వద్ద ఉన్న తలుపులమ్మ తల్లి జాతర ముగింపు సందర్భంగా ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీసరోజ, కటకం చలం, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొంకుదురులో సత్తెమ్మ సంబరం

బిక్కవోలు, జనవరి 21: కొంకుదురులో చిన్నం వంశీయుల కుల దేవత సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గరగలపై వుంచి మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు. చిన్నం వంశీయుల ఆడపడుచుల రాకతో గ్రామమంతా కోలాహలంగా మారింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే రిజర్వేషను కౌంటర్ బయట ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని టూటౌన్ సీఐ టి.గణేశ్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 27-32 ఏళ్లు ఉంటుందని.. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు : ఎమ్మెల్యే రాజా

రాజానగరం, జనవరి 21: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ముక్కినాడ, ముక్కినాడ పాకలు గ్రామాల్లో నివసిస్తున్న 200 మంది లబ్ధిదా రులకు అవసరమైన ఇళ్ల స్థలాలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా ముక్కినాడలో 3.70 ఎకరాలు లేఅవుట్‌తో పాటు 5 ఎకరాల్లో వెలసిన మరో లేఅవుట్‌ను పరిశీలించామని, త్వరలో స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో మండెల సునీల, అనదాసు సత్యనారాయణ, సోడ సాని సత్తిబాబు, ముక్కినాడ సాయిరాం, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే టీడీపీ, జనసేన కలయిక

ఆత్మీయ సమావేశంలో ఆదిరెడ్డి శ్రీనివాస్



టీడీపీ,జనసేన ఆత్మీయ సమావేశంలో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21: ప్రజాస్వామ్య పరిరక్షణకే టీడీపీ, జనసేన పార్టీలు కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 32,33 డివిజన్లలో ఆదివారం జరిగిన టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ ,జనసేన పార్టీల మధ్య సమన్వయం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీల మైత్రి మరింత బలంగా ఉండాలన్నా ఆలోచనలతోనే ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. సంప్రదాయాలకు విరుద్ధంగా ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఉత్సవ రథాన్ని ఎంపీ భరత్ రామ్ తమ వ్యక్తి గత కార్యక్రమాలకు వినియోగించుకోవడం సరికాదని విమర్శించారు. అధికారులపై బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాల్మన్ రాజు, టీడీపీ మాజీ కార్పొరేటర్ ద్వారా పార్వతి సుందరి, నాయకులు సరస్వతి, పండు, జనసేన నాయకులు నాగేశ్వరరావు తదితలరులు పాల్గొన్నారు.

రాజానగరంలో జనసేన నూతన కార్యాలయం



జనసేన నూతన కార్యాలయం వద్ద జనసైనికులతో బత్తుల

రాజానగరం, జనవరి 21: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మహిళా సాధికార కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. తొలుత స్థానిక శ్రీరామ్‌నగర్ కాలనీ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి మార్గ మధ్యలో రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపించి, పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే స్థానిక బస్టాండ్ కూడలిలో స్థాపించిన పార్టీ జెండాను వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తోట రామకృష్ణ, వరలక్ష్మి, పలువురు జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌లు పరిశీలించిన ఆర్డీవో



చినకొండేపూడిలోని పోలింగ్‌బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

సీతానగరం, జనవరి 21: మండలంలోని చినకొండేపూడి, సీతానగరం, రఘుదేవపురం, నాగంపల్లి గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మంచినీటి సదుపాయం, విద్యుత్, వెంటిలేషన్, ప్రత్యేకవసరాలు ఉన్నవారికి రెయిలింగ్ సదుపాయం తదితర అంశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ పొగరు కృష్ణారావు ఉన్నారు.

నేడు స్పందన యథాతథం

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 21: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే స్పందన యథాతథంగా జరుగుతుందని అధికారులు తెలిపారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజ లు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు రావాలన్నారు.






అమ్మ కరుణిస్తే.. వేషం మార్చాల్సిందే!

ఆచార సంప్రదాయాలకు హిందువులు పెట్టిందిపేరు.. తరం మారినా నాటి తరం ఆచారాలు నేటికీ పాటిస్తూనే ఉంటారు. దీనికి ఉదాహరణే తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని కర్రి వారి సతెమ్మ జాతర ... ఆ జాతరకు వెళితే చాలా మంది వివిధ వేషధారణల్లో కనిపిస్తారు.. వారంతా కళాకారులు కాదండోయ్... గ్రామానికి చెందిన యువకులు.. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు రూథర్‌ఫర్డ్, గోల్డ్‌మెన్, దేవతలు, రాక్షసులు తదితర వేషాలతో అలరించారు. అంతే కాదండోయ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు సోమవారం జరిగే జాతరలో విచిత్ర వేషాలు ధరించి భిక్షాటన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ జాతరలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని విభాగాలకు చెందిన యువత వేషధారణలు వేయడం ఆసక్తికరంగా ఉంటుంది. - అనపర్తి

జగమంతా రామమయం





కోరుకొండలో శోభయాత్ర



అయోధ్య రామమందిరం గీసిన విద్యార్థి సాత్విక్

జై శ్రీరామ్.. జై శ్రీరామ్ నినాదాలతో జగమంతా ఊగిపోయింది.. ఎందుకంటే రాముడు లేని ఊరు లేదు.. రామ పేరు లేని ఇల్లూ లేదు.. అంతలా రాముడు జనంతో మమేకం.. అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే జగమంతా పండుగలా మారింది.. ఎవరి నోటా విన్నా అదే మాట.. ఎక్కడ చూసినా అదే పాట.. సత్యదేవానర్సరీ నర్సరీ రైతులు పుల్లా సత్యనారాయణ(చంటియ్య), పుల్లా పెదసత్యనారాయణలు వారి నర్సరీలో వివిధ రకాల మొక్కలు, పరిమళాలు వెదజల్లే రంగురంగుల పూలతో శ్రీరాముని ప్రతిరూపాన్ని, రామమందిరం, ప్రధాని నరేంద్రమోడీ చిత్రరూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఇలా నర్సరీలలో రాముడికి పువ్వులతో అభిషేకం చేశారు. అదే విధంగా వేమగిరి తోటకు చెందిన వాసంశెట్టి వెంకటేశ్వరరావు-లక్ష్మీశ్రీ దంపతుల కుమారుడు సాత్విక్ అయోధ్య శ్రీరామ మందిరం ఆకృతిని అందంగా చిత్రీకరించాడు.. ఉండ్రాజవరం మండలం వెలగదుర్రుకు చెందిన తాళపత్ర చిత్రకారుడు గోపరాజు తాటి మొవ్వ ఆకులతో శ్రీరాముడిని చిత్రాన్ని తయారు చేశాడు. రంగంపేటకు చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ అయోధ్యలో రాముని ఆగమనం - అవనికే ఆనందం అనే నినాదంతో శ్రీరాముడి సైకత శిల్పం రూపొందించాడు. కోరుకొండలో శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. భారీగా భక్తజనం హాజరై రామా.. రవికుల శ్యామా అంటూ కీర్తించారు.. ఇలా ఎవరికి తోచిన రీతిన వారు రాముడికి తమ గుండెల్లో ఉన్న స్థానాన్ని చూపారు.. - కడియం

రేపు రాజమహేంద్రవరంలో ఆటోలు బంద్

ఉచిత బస్ ప్రయాణం హామీని వ్యతిరేకిస్తూ నిరసన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21 : మహిళలకు ఉచిత బస్ సౌకర్యం హామీని వ్యతిరేకిస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోల బంద్ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్(బాక్సుప్రసాద్) తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం సెంటర్ వరకు మౌన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. బంద్‌లో అన్ని ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొంటారని తెలిపారు. బంద్ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరంలో ఆటోలు తిరగవన్నారు.అసౌకర్యానికి ప్రజలు సహకరించాలన్నారు.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.2.4 లక్షలు



నిడదవోలు, జనవరి 21 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మను ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై దూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన చేశారు. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శిం చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కలగ జేశారు.అమ్మవారికి ఆదివారం మొత్తం రూ.2,40,720లు ఆదాయం లభిం చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.

డ్వామా ఇన్‌చార్జి పీడీగా ముఖలింగం



రాజమహేంద్రవరం రూరల్, జనవరి 21 : డ్వామా ఇన్‌చార్జి పీడీగా ఎ.ముఖలింగం ఆదివారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరంలో అసిస్టెంట్ డైరెక్టర్ డీఈఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు.ఇప్పటి వరకు పీడీగా బాధ్యతలు నిర్వహించిన జగదాంబ కత్తిపూడి క్లస్టర్ ఏపీడీగా బదిలీ అయ్యారు. పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఈయన బా ధ్యతలు నిర్వహించనున్నారు.పలువురు సిబ్బంది అభినందించారు.

నెలాఖరున నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం 7



టూటౌన్ పోలీసుల అదుపులో ఉన్న అంగన్‌వాడీలు

జక్కంపూడి కుటుంబంలో జగన్ చిచ్చు!

రాజా ఆశలపై నీళ్లు.. గణేశ్‌కి కొత్త ఆశలు?

- రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా రాజా
- రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా గణేశ్
- ఊరూవాడా సాగుతున్న ప్రచారం
- సన్నిహితుల వద్ద వాపోతున్న కుటుంబీకులు
- వైసీపీలో కొనసాగుతున్న టిక్కెట్..ఇక్కట్లు
- డాక్టర్ గూడూరి, చందన పరిస్థితేంటో..
- మరో 3 నియోజకవర్గాల్లో ఇంకా టెన్షన్



జక్కంపూడి రాజా



జక్కంపూడి గణేశ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్ వైఖరితో వైసీపీ నేతలు బెంబేలెత్తుతున్నారు. బలమైన నేతలమనుకునే వారిని కూడా వైసీపీ అధిష్ఠానం ముప్పుతిప్పలు పెడుతోంది. ఇంతవరకూ ప్రతిపక్షాలు, వ్యతిరేకులకే వేధింపులు ఉన్నాయనుకుంటే ఇవాళ వైసీపీ నేతలకు కూడా ఒక విధమైన వేధింపులు తప్పడంలేదు. జిల్లాలో ఇప్పటి వరకూ ఇద్దరు బీసీ నేతలు,ఇద్దరు ఎస్సీ నేతలకు స్థానభ్రంశం కలిగించి వేరే నియోజకవర్గాలకు బదిలీ చేసిన అధిష్ఠానం బలంగా ఉన్నామనుకున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబంలో కూడా చిచ్చు పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాయలసీమ పెత్తందారీ విధానం ఈ ప్రాంతంలో కూడా ప్రయోగిస్తున్నారు. కడప, రాయలసీమ జిల్లాల్లో నాయకుడిగా ఉన్న వ్యక్తి ఆయా గ్రామాలు, ఆయా కుటుంబాలు కూడా ఎప్పుడూ కలవనీయకుండా మంట రాజేస్తూ మొత్తం అందరినీ తన గుప్పెట్లో పెట్టుకుంటారనే ప్రచారం ఉంది. అదే విధానం ఇక్కడ కూడా కొనసాగుతోంది. ఎవరికి వారిని వేర్వేరుగా ప్రోత్సహిస్తున్నట్టు నటిస్తూ రాజకీయాల మధ్య సఖ్యత ఉండనీయ డంలేదనే విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబంలో కూడా చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కుటుంబం కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉండేది. ఎందుకంటే జక్కంపూడి రామ్మోహనరావు వైఎస్‌కు వీరవిధే యుడిగా ఉండేవారు.ఈ నేపథ్యంలో వైసీపీ వచ్చాక జక్కంపూడి కుటుంబం అందులో చేరింది. మొదట జక్కంపూడి రామ్మో హనరావు సతీమణి జక్కంపూడి విజయలక్ష్మికి 2014లో రాజానగరం టికెట్ ఇచ్చారు.ఆమె ఓడి పోయారు. కానీ 2019లో ఆమె పెద్దకొడుకు జక్కంపూడి రాజాకు టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. ఆయనతో పాటు ఆయన సోదరుడు జక్కంపూడి గణేశ్ వైసీపీ యూత్ వింగ్‌లో కీలకంగా ఉన్నారు. విజయలక్ష్మి కూడా పార్టీకార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తుంటారు. రాజానగరం సీటు మళ్లీ తనదేనని నమ్మకంతో నియోజకవర్గంలో పార్టీపనిలో నిమగ్నమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరం ఎంపీ స్థానం నుంచి పోటీ చేయమని అధిష్ఠానం ప్రతిపాదించనట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ఆయన తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇంతలో రాజాను ఎంపీగా పోటీ చేయించడంతో పాటు గణేష్‌ను రాజానగరం నుంచి పోటీకి దింపుతామని కూడా అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.ఈ కుటుంబ సభ్యులొకరు ఈ విషయాన్ని సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈ కుటుంబానికి ఫ్యామిలీ ప్యాక్ ఇస్తారా లేదా కుటుంబంలో చిచ్చు పెడతారా అనే అనుమానాలు క్యాడర్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ,ఒక లోక్ సభ నియోజకవర్గం ఉంది. ఇప్పటికే నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే.రామచంద్రపురం నుంచి మంత్రి చెల్లుబోయిన వేణుకు స్థానభ్రంశం కలిగించి రాజమహేంద్రవరం రూరల్‌కు, ఎంపీ భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తప్పిం చి రాజమహేంద్రవరం సిటీకి, మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి తప్పించి గోపాలపురం నియోజకవర్గానికి, అక్కడి ఎమ్మెల్యే తలారి వెంక ట్రావును తప్పించి కొవ్వూరు నియోజకవర్గానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.దీంతో ఆయా నియోజకవర్గాల్లో వారి అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొవ్వూరులో ఇప్పటికే పలువురు గ్రామశాఖ అధ్యక్షులు పదవులకు రాజీనామా చేశారు. పరిస్థితి ఇలా ఉంటే మిగతా మూడు నియోజకవర్గాల్లో రాజానగరం, అనపర్తి, నిడదవోలు ఉన్నాయి. రాజానగరంలో ప్రస్తుతం అధిష్ఠానం ఓ ప్రయోగం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మిగతా రెండు స్థానాలపై కూడా లోపాయికారిగా అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. కానీ అధిష్ఠానం నిర్ణయం ఏంటో ప్రకటించే వర కూ ఈ టెన్షన్ తప్పదు. మరో ప్రక్క లోక్‌సభ స్థానం బీసీలకు ఇస్తామని ఆశపెట్టి పలువురిని లైన్‌లో పెట్టారు.వారిలో ఇద్దరి నుంచి కోఆర్డినేటర్ పదవులు వెనక్కి లాగేసుకున్న సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం ఎంపీ టిక్కెట్ గూడూరు శ్రీని వాస్‌కు దక్కుతుందని అంతా అనుకుంటున్నారు. అయితే రాజాకు ఎంపీ టిక్కెట్ ఇస్తే మరి గూడూరి పరిస్థితి ఏమిటనే సంశయం నెలకొంది. మరో కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సంగతి తేలలేదు. ఇలా వైసీపీలో అంతా అయోమయంగా ఉంది.

కోడి కత్తి కేసులో కోర్టుకెందుకెళ్లవు?

జగన్ తీరుపై మండిపడిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : కోడికత్తి దాడి కేసులో జగన్ నువ్వెందుకు కోర్టుకెళ్లడంలేదు.ఎందుకు వాంగ్మూలం ఇవ్వడం లేదు. ఐదేళ్లుగా అమాయకుడైన దళిత యువకుడిని జైలు నుంచి బయటకు రాకుండా చేశావని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. తన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నీకుట్ర రాజకీయాలు బయటకు వస్తాయనే భయంతోనే కోర్టు ఎన్ని సార్లు పిలిచినా వెళ్లడం లేదన్నారు.చిన్న కేసులో ఐదేళ్లకు కూడా బెయిల్ రాదా? డ్రైవర్‌ను హత్యచేసిన ఎమ్మెల్సీని కాపాడతావు.. మాస్కు అడిగిన డాక్టర్‌ను హింసిస్తావు, శిరోముండనం కేసులో దోషులను కాపాడతావు.నీవు దళిత ద్రోహివని మండిపడ్డారు. జగన్‌ను ఇంటికి పంపితే కానీ ఏపీ అభివృద్ధిలోకి రాదన్నారు. ఆంధ్రా నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహంతో రాజకీయం చేస్తున్నావని.. ఆయన పేరు తలచుకోవడానికి కూడా నీవు పనిచేయవని దుయ్యబట్టారు. ప్రభుత్వం మారిన వెంటనే నీపై విచారణ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.



కులగణనకు సర్వర్ కష్టాలు

సచివాలయ సిబ్బంది,వలంటీర్లకు తప్పని కుస్తీ

గోపాలపురం, జనవరి 21: కుల గణన సర్వేకు సర్వర్ కష్టాలు తప్పడం లేదు. ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన ప్రారంభించారు. 28వ తేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. అయితే గత మూడు రోజులుగా సర్వర్ పనిచేయక రేయింబవళ్ళు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు లక్ష్యాన్ని అధిగమించేందుకు నానాతంటాలు పడుతు న్నారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కులగణన బాధ్యతను అప్పగించారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి ముగ్గురు లేదా నలుగురు వలంటీర్లను అప్పగించి ఈ నెల 28వ తేదీలోపు కులగణన పూర్తి చేయాలంటూ హుకుంజారీ చేశారు. అయితే పగటిపూట సర్వర్ పని చేయకపోవడంతో ఉన్నతాధికారుల ఒత్తిళ్ళ భయంతో తమకు ఇచ్చిన లక్ష్యాన్ని రాత్రయినా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బంది సమయానికి మించి పనిచేస్తున్నారు. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో మూడు రోజులకు కేవలం 18శాతం మాత్రమే కులగణన జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.గతంలో కులగణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు అప్పగించడంతో వారి నైపుణ్యంతో సమర్థవంతంగా పని చేసి లక్ష్యాన్ని అధిగమించే వారు.. రాష్ట్ర ప్రభుత్వం అనుభవమే లేని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి బాధ్యత అప్పగించడంతో ఆపసోపాలు పడుతున్నారు. కులగణన సర్వేపై సరైన అవగాహన లేక కుస్తీలు పడుతున్నారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం

ఛలో విజయవాడను భగ్నం చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను కదలనివ్వడం లేదు.. దీక్షలు చేయనివ్వడంలేదు.. హామీలు అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతూనే ఉంది. ఎస్మా చట్టాన్ని ప్రయో గించడంతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా అంగన్ వాడీలు బెదరలేదు..దీంతో శనివారం అధికారులు బెదిరింపులకు దిగారు.వస్తే ఉద్యోగం లేకపోతే మీ ఇష్టం అంటూ భయపెట్టారు. దీంతో తాడేపేడో తేల్చుకోవాలని ఛలో విజయవాడకు పిలుపు ఇచ్చారు. తాడేపల్లిలో జగన్ ఇంటిని ముట్టడించాలని తలంచారు.ఈ నేపథ్యంలో విజయవాడ బయలుదేరిన అంగన్వాడీలను రైల్వేస్టేషను, ఆర్టీసీ బస్టాండ్లలో పోలీసులు అడ్డుకున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషనుకు చేరుకున్న రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, సీతానగరం, కోరుకొండకు చెందిన 31 మంది అంగన్వాడీలను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషనుకు తరలించారు. కౌన్సెలింగ్ చేసిన తర్వాత వారి వివరాలు నమోదు చేసుకొని సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ టీ.గణేశ్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 10మంది వరకూ అంగన్వాడీలను అదుపులోకి తీసుకొని ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లారు.ఛలో విజయవాడకు అనుమతి లేదని.. అందువల్ల వెళ్లడానికి వీల్లేదని చెప్పి సొంత పూచీకత్తుపై పంపించేశారు.

ప్రయాణ ప్రయాస!



ఎక్కడానికి కూడా ఖాళీ లేకుండా ఉన్నరైలు

ఎక్కలేం.. దిగలేం

- కిటకిటలాడిన రైళ్లు..బస్‌లు
- ముగిసిన సంక్రాంతి సెలవులు
- ఊళ్లకు పయనమైన జనం
- రైళ్లలో బాత్‌రూమ్‌లు ఖాళీలేవ్
- ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం
- నేడు రద్దీ ఉంటుందని సమాచారం

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందడి ముగిసింది.. గత బుధవారం ముక్కనుమతో సంక్రాంతి పండుగ ముగిసింది. అయితే గురువారం అందరూ తిరుగుముఖం పడదామనుకునే లోపునే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల సెలవులను 21వ తేదీ వరకూ పొడిగించింది. దీంతో ఎక్కడివారు అక్కడే ఆగిపోయారు. ఆదివారంతో సెలవులు ముగియడంతో అంతా సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో తిరుగు ప్రయాణాల రద్దీ ఎక్కువైంది. రైళ్లన్నీ కిక్కిరిసి నడుస్తున్నాయి. పశ్చిమబంగ్లా, అసోం వైపు నుంచి వచ్చే రైళ్లలో కాలు పెట్టడానికి వీల్లేకుండా బోగీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. జనరల్, రిజర్వేషను బోగీల్లో సామర్థ్యానికి మించి మూడింతల ప్రయాణికులు ఉంటున్నారు. దీంతో ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. రిజర్వేషను బోగీల్లో ఒక కూపేకు ఎనిమిది మందికి సీట్లు/బెర్తులు కేటాయిస్తారు. కానీ ఒక్కో కూపేలో తక్కువంటే 20 మంది ప్రయాణికులు ఉంటున్నారు. దీనికి సంబంధించి రైల్ మదద్‌కి రోజూ ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆహార పదార్థాల తర్వాత స్థానంలో ఈ ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్పీఎఫ్ పోలీసులు, టీటీఈలు బోగీ వద్దకు వెళ్లి క్లియర్ చేయించినా రైలు బయలుదేరగానే మళ్లీ పరిస్థితి మొదటికి వస్తోంది. రిజర్వేషను బోగీల్లో టిక్కెట్లు చెక్ చేయడానికి టీటీఈలకు నరకం కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా సిల్చార్, సిల్గాట్, గువాహటి వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల ఎప్పుడూ విపరీతమైన రద్దీతో నడుస్తుంటాయి.ఇప్పుడు పండుగ తిరుగు ప్రయాణాల సందర్భంగా బోగీలు పూర్తిగా నిండిపోతు న్నాయి. ప్రమాదకరం అని తెలిసినా బోగీ ద్వారాలకు వేలాడుతూ మరీ ప్రయాణించాల్సి వస్తోంది. మహిళలు ఇలానే ప్రయాణిస్తున్నారు.రాత్రి వేళల్లో రైలు వెళ్తున్న సమయంలో హోరున వీచే చలికి ద్వారాల వద్ద ప్రయాణికుల చేతుల్లో స్పర్శ నెమ్మదించి పట్టుకోల్పోయి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకసారి బోగీలోనికి వెళ్తే దిగేవరకూ కాలు కదపడానికి నానా తంటాలూ పడుతున్నారు. దిగే సమయంలో కూడా నరకం చూస్తున్నారు.బాత్‌రూమ్‌లలో కూడా ప్రయాణికులు ఉంటున్నారంటే రైలు ప్రయాణం ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎక్కువగా తిరుగు ప్రయాణాలు విజయవాడ, బెంగళూరు,చెన్నై, హైదరాబాద్, వైజాగ్, భువనేశ్వర్‌కి ఉంటాయి. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడం, రద్దీని గమనించి రైళ్లు నడపలేకపోవడంతో దగ్గరి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నలిగిపోతున్నారు. దగ్గరి ప్రాంతాల ప్రయాణకుల డిమాండ్ ఎక్కువగా ఉండే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లనూ రద్దు చేయడం ప్రయాణికులకు మరింత ముప్పుగా మారింది. విజయవాడ, తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు, తుని, సామర్లకోట, విశాఖ వెళ్లే ప్రయాణికులు ఏ రైలు ఎక్కాలో అర్థంకాని పరిస్థితుల్లో ఏదోక రైలు ఎక్కి బతుకుజీవుడా అంటూ గమ్యస్థానంలో దిగుతున్నారు. సుదూర ప్రాంతాలను కలిపే రైళ్లలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వరకూ రిజర్వేషను చేయించుకున్న ప్రయాణికులు ఆ బోగీలు ఎక్కలేక.. జన్మభూమి వంటి ఇంటర్‌సిటీల్లో కాలు పెట్టడానికి వీలులేక తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రద్దీ కొనసాగుతున్నా ఉన్న రైళ్లనూ రద్దు చేస్తుండడంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు.రైల్వే అధికారులు సాంకేతిక తదితర కారణాలు చూపడం ఇటీవల కాలంలో షరా మామూలే అయినా తమతో ప్రయాణిస్తే ప్రయాణ హింస ఏమిటో అర్థం అవుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుగు ప్రయాణికుల వల్ల రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా బాగానే ఆదాయం సమకూరింది. సాధారణ రోజుల్లో 3 నుంచి 4 వేల మంది సాధారణ టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రయాణిస్తుంటారు.ఈ ఐదు రోజుల్లో ఆ సంఖ్య పది వేలకు చేరగా రోజుకు ఆదాయం సరాసరి రూ.12లక్షలు దాటింది. రిజర్వేషను ప్రయాణికులను కలుపుకొంటే రోజుకు రాకపోకలు సాగించే వారి సంఖ్య 20 వేల వరకూ ఉంది. బస్టాండ్ కూడా కిటకిటలాడింది. బస్ ఎక్కడానికి కూడా ఖాళీ లేకుండా ఉంది. ప్రయాణికులతో ఉదయం నుంచి బస్టాండ్ కిటకిటలాడింది. సోమవారం కూడా రద్దీ ఉంటుందని ఆర్టీసీ జిల్లా అధికారులు చెబుతున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రాధ్యక్షుడు జుత్తిగ



కల్లుగీత కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి

నిడదవోలు, జనవరి 21: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్రాధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం నిడదవోలులోని తాటిబెల్లం ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కల్లుగీత వృత్తిని సర్వనాశనం చేసి ఉపాధిని దెబ్బతీసిం దన్నారు. కార్మికులను కులాలుగా చీల్చి బోగస్ కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వాటిని తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు అప్పుతెచ్చుకున్నారన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కల్లుగీత వృత్తి వ్యతిరేక విధానాలపై తణుకులో జరిగే మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బొల్లా ముసలయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోమటి శ్రీనివాస్, గుబ్బల నరసింహస్వామి, జువ్వల రాంబాబు, గుబ్బల వీరరాఘవులు, మేకా సత్యనారాయణ, బొల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన



సంస్కృత పాఠశాలలో గోష్పాదేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు, జనవరి 21: కొవ్వూరు సంస్కృత పాఠశాలలో శ్రీ లలితా పార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా ఆలయార్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి గణపతి పూజ, గోష్పదేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిళ్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన రుద్రహోమం నిర్వహించారు. అనంతరం దేవతామూరుతలకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయోధ్య రాముడి కోసం పాదయాత్ర



దూబచర్లలో పాదయాత్ర చేస్తున్న రామ భక్తులు

నల్లజర్ల, జనవరి 21: అయోధ్యలో నిర్మించిన రామాలయంలో రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దూబచర్లలో అన్ని ఆలయ కమిటీలతో పాటు భక్తులు ఆదివారం విజయోత్సవ ఊరేగింపుగా పాదయాత్ర చేశారు. తొలుత స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ విగ్రహాలతో దాదాపు 800 మంది రామనామం స్మరిస్తూ పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో మణికంఠ ఆలయం, కోదండ రామాలయం, చిన్న రామాలయం ఆలయ కమిటీలు పాల్గొన్నాయి.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

దేవరపల్లి, జనవరి 21: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యరాముడి అక్షింతలు వితరణ



బంధపురంలో అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం

దేవరపల్లి, జనవరి 21: బంధపురంలో ఆదివారం అయోధ్య రాముని అక్షింతల వితరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో ఉంచి పురవీధుల్లో మేళతాళాలు, బాణసంచా, కోలాట భజనలతో ఊరేగిస్తూ అక్షింతలను ప్రతీ ఇంటికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాత్రగడ్డ పరమేశ్వరగాంధీ, ఆలయ ప్రధానార్చకులు దేవులపల్లి రామకృష్ణశర్మ, బీజేపీ నియోజకవర్గ ప్రవాసయోజన కన్వీనర్ రవీంద్ర, స్థానికులు బాలం బాబి, సుంకర రాంబాబు, దుద్దుపూడి సత్యనారాయణ, గణేశ్వరరావు, కె.ప్రసన్న పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి పూజలు



సంస్కృత పాఠశాల శివాలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, జనవరి 21: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైసీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన తర్వాత మొట్టమొదటి సారిగా ఆదివారం కొవ్వూరు విచ్చేశారు. ఆయనకు మెరకవీధి వినాయకుని గుడి వద్ద నాయకులు ఘన స్వాగతం పలికారు. వినాయకుని గుడి, సంస్కృత పాఠశాల శివాలయం, మెయిన్‌రోడ్‌లోని మసీదు, మెరకవీధి లూథరన్ చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న కొవ్వూరు, 25న గోపాలపురంలో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పరిమి హరిచరణ్‌లను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెన్ని, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, రుత్తల భాస్కరరావు, కంఠమణి రమేష్‌బాబు, ముదునూరి సూర్యనారాయణరాజు, ముదునూరి నాగరాజు, ముళ్లపూడి కాశి పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌లు పరిశీలించిన ఆర్డీవో



సీతానగరం, జనవరి 21: మండలంలోని చిన కొండేపూడి, సీతానగరం, రఘుదేవపురం, నాగంపల్లి గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మంచినీటి సదుపాయం, విద్యుత్, వెంటిలేషన్, ప్రత్యేకవసరాలు ఉన్నవారికి రెయిలింగ్ సదుపాయం తదితర అంశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ పోగరు కృష్ణారావు ఉన్నారు.

వైసీపీకి సలాది సందీప్ రాజీనామా



కొవ్వూరు, జనవరి 21: వైసీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవ్వూరుకు చెందిన సలాది సందీప్ కుమార్ వ్యక్తిగత కారణాలతో తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు అందజేశామన్నారు. పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశానని, తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం



దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

ఉండ్రాజవరం, జనవరి 21: బీసీలకు సముచిత స్థానం ఇచ్చింది టీడీపీయే మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వడ్లూరు గ్రామంలో తెలుగుదేశం, జనసే పార్టీల నాయకులు బూరుగుపల్లి శేషారావు, బీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ బీసీలు పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. బీసీసెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చెల్లుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీలకు ఎన్నో పదవులు దక్కాయని, బీసీల సంక్షేమానికి పార్టీ ఎంతో కృషి చేసిందని వివరించారు. తొలుత ఎన్టీఆర్, అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూర్ భాషా, షేక్ సుభాని, జనసేన నాయకుడు పాలా వీరాస్వామి, నార్గని వెంకట్రావు, కోమట్లపల్లి సుబ్బారావు, సింహాద్రి రామకృష్ణ, వల్లేపల్లి రాజా, రాచమల్ల శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

▸▸ జయహో బీసీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

బీసీలకు తెలుగుదేశం పార్టీ పెద్ద పీట : మద్దిపాటి

దేవరపల్లి, జనవరి 21: బీసీలకు తెలుగుదేశం పార్టీ పెద్ద పీటవేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో ఆదివారం సాయంత్రం టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో చంద్రబాబు నిర్వహించే రా..క దలిరా సదస్సులో లక్షమంది పాల్గొంటారని ఈ సభ విజయవంతం చేయ డానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో వైసీపీ ఓడిపోతుందనే భయంతో హోం మంత్రిని ఇక్కడ అభ్యర్థిగా మార్చారన్నారు. జగన్ రాక్షస పాలనతో ప్రజలు విసుగుచెందార న్నారు. రాష్ట్ర నూర్బాష బీసీ సాధికార కమిటీ కన్వీనర్ షేక్ సుభాన్ మాట్లాడుతూ టీడీపీలోనే బీసీలకు మేలు జరిగిందని, మహిళలకు రిజర్వేషన్, ఆస్తిహక్కు కల్పించడం, డ్వాక్రా గ్రూపులు ప్రవేశపెట్టినట్టు చెప్పారు. రూ.84 వేల కోట్ల



పెరవలి: కానూరు అగ్రహారం సమావేశంలో కుందుల, జనసేన నాయకులు



ఉండ్రాజవరం: వడ్లూరులో శేషారావుతోపాటు బీసీ నాయకుల సంఘీభావం

బీసీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ లక్షకోట్లు దోచుకున్నాడని, చంద్రబాబు అభివృద్ధి కోసం అప్పులు చేస్తే జగన్ జల్సాల కోసం అప్పులు చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మారాజు, మీరాసాహెబ్, గన్నమని హరికృష్ణ, కంటిపూడి సుబ్బారావు, బొల్లిన విజయభాస్కర్, కొఠారు ధ్రువకాంత్, యద్దనపూడి రవీంద్ర, ఉప్పులూరి రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయానికి కృషి చేయాలి : కుందుల

పెరవలి, జనవరి 21: నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికి టిక్కెట్ ఇచ్చినప్పటికీ అందరూ కలిసికట్టుగా విజయానికి కృషి చేయాలని టీడీపీ నాయకుడు కుందుల వీర వెంకట సత్యనారాయణ అన్నారు. కానూరు అగ్రహారంలో ఆయన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జనసేన, టీడీపీ ఆత్మీక సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో వైసీపీని ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన పోరాటం చేస్తున్నాయని, అభ్యర్థుల విజయానికి కృషి చేద్దామన్నారు. అభ్యర్థులను ప్రకటించే వరకు కూడా ప్రభుత్వ అసమర్థ, వ్యతిరేక విధానాలపై గ్రామ స్థాయిలో జనసేన, టీడీపీ కార్యకర్తలు సంయుక్తంగా ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ కోటిపల్లి మురళీకృష్ణ, తులా చినబాబు, సౌజన్య కాకర్ల నాని, సదా వెంకటేష్, కానూరి ఎంపీటీసీ కోలా సీతయ్యనాయుడు, ఆకుల నాగేశ్వరరావు, గరిమెల కొండలరావు పాల్గొన్నారు.

28న రాజమహేంద్రవరంలో హిందూ సంగమం

▸▸ కొవ్వూరులో కరపత్రాలు, పోస్టర్స్ ఆవిష్కరణ

కొవ్వూరు, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కొవ్వూరు ఖండలోని అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్టు ఖండ కార్యావాహ గోవర్ధనం శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 28న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న భారీ హిందు సంగమం కార్యక్రమానికి సంబంధించి ఆదివారం కొవ్వూరులోని పాతవూరు వరద గోపాలస్వామి ఆలయంలో కరపత్రాలు, పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. వీహెచ్‌పీ కార్యదర్శి తోరం శ్రీనివాసు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పెనకనమెట్ట, నందమూరు, పశివేదల, వాడపల్లి, మద్దూరు, మద్దూరులంక, పంగిడి, దొమ్మేరు, ఆరికిరేవుల, కుమారదేవం గ్రామాలతోపాటు కొవ్వూరు పట్టణంలోని రామాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పారాయణాలు, కల్యాణోత్సవాలు, అన్నదానాలు జరుగుతాయన్నారు. 28న అధికసంఖ్యలో భక్తులు మధ్యాహ్నం 2 గంటలకు మెరకవీధి ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకుని ర్యాలీగా రాజమహేంద్రవరం వెళ్లాలని వీహెచ్‌పీ ప్రఖంగ కార్యకర్త మంగిన నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తురగా భాస్కరరామం, బాలదారి చక్రపాణి, పూల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరద గోపాలస్వామి ఆలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు గోష్పదక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కొవ్వూరు గోష్పదక్షేత్రంలో పవిత్ర జీవన్ సంస్థాన్, అఖండ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6గంటలకు గోష్పదక్షేత్రంలోని కాశీ విశ్వనాధుని సన్నిధిలో దీపోత్సవం, గంగపూజ, దీపావళి నిర్వహించనున్నట్టు ఆధ్యాత్మికవేత్త పాలకోడేటి సత్యనారాయణమూర్తి తెలిపారు. అలాగే గోదావరిమాతకు 108 చీరలతో సారె సమర్పిస్తామని చెప్పారు.

రాబోయే రోజుల్లో వైసీపీ ఖాళీ

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
టీడీపీలో చేరికలు

గోకవరం, జనవరి 21: ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వైసీపీ రానున్న రోజుల్లో పూర్తిగా ఖాళీ అయిపోతుందని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు వైసీపీ సీనియర్ నాయకుడు గాజింగం సత్తిబాబు, ఇటికాయలపల్లి మాజీ సర్పంచ్ కండేపల్లి రాంబాబుతో పాటు సుమారు 500 మంది వైసీపీని వీడి ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి నెహ్రూ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ముందుగా గోకవరంలోని శివాలయం నుంచి నెహ్రూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యంలో అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం దేవి చౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి ర్యాలీగా కృష్ణునిపాలెం శివారు గోపికృష్ణా కల్యాణ మండపం వద్దకు చేరుకుని భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ సీఎం జగన్ మాయమాటలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత లాభం కోసం ఆరాటపడమే తప్ప నియోజకవర్గ ప్రజల మేలు కోసం ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మంత్రిగా పనిచేసిన తోట నర్సింహం కూడా నియోజవర్గానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కనీసం ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా ఒక ప్రాజెక్టును కూడా మంజూరు చేయలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, పోసిన ప్రసాద్, మండిగ గంగాధర్, ఉంగరాల గణేష్, గునిపే భరత్, స్టూడియో రాజు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



బిక్కవోలులో పూలేకు నివాళులర్పించిన బీసీ నేతలు, రామకృష్ణారెడ్డి

▸▸ రంగాపురంలో బీసీ జయహో సభలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జనవరి 21: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రంగాపురంలో ఆదివారం రాత్రి బీసీ జయహో సభ నిర్వహించారు. ముందుగా మండలంలోని పందలపాక గ్రామం నుంచి ఊలపల్లి, బిక్కవోలు, ఇళ్లపల్లి గ్రామాల మీదుగా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీసీలందరూ బైక్ ర్యాలీతో రంగాపురం చేరుకున్నారు. ప్రతి గ్రామంలోని ఎన్టీఆర్, పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. రామకృష్ణారెడ్డికి మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టిల్లు అని, బీసీలందరూ టీడీపీ హయాంలోనే గుర్తింపు పొందారన్నారు. బీసీల నైపుణ్యం వెలికితీయడానికి టీడీపీ తీసుకువచ్చిన 30కు పైగా పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. నాసిరకం మద్యంతో మందు బాబులు కూడా మోసాలకు గురయ్యారన్నారు. వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలే నష్టపోయారని, కబ్జాలు చేసేవారికి న్యాయం చేసే ప్రభుత్వమని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక భూరక్షణ చట్టం రద్దు చేస్తామని, బీసీలకు యేటా 15వేలు కోట్లు ఖర్చు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుపూడి సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, బాలయ్య, తెనెల శ్రీనివాసు, రెడ్డి శ్రీనివాసరావు, పితాని శివరామకృష్ణ, యనమదల రాజు, కానేటి అప్పలస్వామి, గేదెల సత్యనారాయణ, రాయుడు రామచంద్రరావు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ-జనసేన ప్రభంజనమే : గోరంట్ల

కడియం, జనవరి 21: రానున్నది తెలుగుదేశం-జనసేన ప్రబంజనమే అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం మాధవరాయుడుపాలెంలో జరిగిన ఓ కార్యక్రమానికి సర్పంచ్ అన్నందేవుల చంటితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు పాడయ్యాయని, రహదారులు పాడై, ప్రతిరోజు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కనీస సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అన్నందేవుల శ్రీను, ఎంపీటీసీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు, యు.దుర్గారావు పాల్గొన్నారు.

రాజ్య వ్యవస్థను వాడుకుంటున్న బీజేపీ

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 21: మోదీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాజ్య వ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నారని, లౌకిక అనే పదాన్ని తొలగించేలా కుట్రలు చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని నేటి రాజకీయం-విస్తరిస్తున్న హిందూ జాతీయ వాదం అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి అయోధ్యను దేశ వ్యాప్తంగా ప్రచారం కోసం వాడుకుంటున్నారని.. దీనికి బడా పెట్టుబడిదారి వర్గం వంతపాడుతుందన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి బాటలు వేసిన లెనిన్ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సదస్సులో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నాయకులు సేపేని రమణమ్మ, బేగం, ఉమ, ఎం.సాగర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం

రాజమహేంద్ర వ రం, జనవరి 21(ఆంధ్ర జ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని విజి లెన్స్ ఎస్పీ సురేశ్ బాబు పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన రోజున ఆ కార్యక్రమాన్ని చూడడానికి రైల్వేస్టేషన్లలో ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో రాజమండ్రి, అనకాపల్లి, తుని, కాకినాడ, నిడదవోలు, తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్లలో రాజమండ్రి విభాగానికి చెందిన రాజరాజనరేంద్ర ఓపెన్ గ్రూప్, గోదావరి ఓపెన్ గ్రూప్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు రద్దీని నియంత్రించడం తది తర సేవలందించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీరామమూర్తి, సహాయ జిల్లా కమిషనర్ దాడి ప్రసాద్, స్కౌట్ మాస్టర్లు హెచ్ఎం ఎస్.రాజ్‌పుత్, ఎస్వీ వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే టీడీపీ, జనసేన కలయిక

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21: ప్రజాస్వామ్య పరిరక్షణకే టీడీపీ, జనసేన పార్టీలు కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 32,33 డివిజన్లలో ఆదివారం జరిగిన టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ జనసేన పార్టీల మధ్య సమన్వయం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీల మైత్రి మరింత బలంగా ఉండాలన్నా ఆలోచనలతోనే ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. సంప్రదాయాలకు విరుద్ధంగా ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఉత్సవ రథాన్ని ఎంపీ భరత్ రామ్ తమ వ్యక్తి గత కార్యక్రమాలకు వినియోగించుకోవడం సరికాదని విమర్శించారు.

చీపురుగూడెంలో కలుషితమవుతున్న తాగునీరు

పైపులైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్థుల మొర



చీపురుగూడెం పాత పోస్టాఫీసు వీధిలో డ్రైనేజీ నుంచి పొంగి ప్రవహిస్తున్న పంచాయతీ తాగునీరు

నల్లజర్ల, జనవరి 21: మండలంలోని చీపురుగూడెంలో వారం రోజుల నుంచి తాగునీరు కలుషితమవుతోంది. పాత పోస్టాఫీసు వీధిలో డ్రైనేజీలో నుంచి పంచాయతీ తాగునీరు లీకవుతోంది. వీధి కుళాయిలు వచ్చిన సమయంలో డ్రైనేజీ పొంగి ప్రవహిస్తుంది. కుళాయి నుంచి నీరు ఆగిపోగానే డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి వెళుతోంది. మళ్లీ కుళాయి నుంచి నీరు వచ్చిన వెంటనే పైపుల్లో ఉన్న నీరు కలుషితమవుతుంది. దీనిపై గ్రామస్థులు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డ్రైనేజీ నీరు తాగునీరులో కలవడం వల్ల గ్రామస్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని, సంబంధిత అధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన కలుషిత నీటిని కట్టడి చేయాలని కోరుతున్నారు.

కులమతాలకు అతీతంగా వాసవీక్లబ్ సేవలు

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ నాగభూషణం



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21: దేశంలో కులమతాలకు అతీతంగా సేవలు అందించడమే తమ సంస్థ లక్ష్యమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ హెచ్ఎస్ నాగభూషణం చెప్పారు. గౌతమి ఘాట్ బొమ్మన రామచంద్రరావు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ హాలులో ఆదివారం జరిగిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. బి పాజిటివ్, బి క్రియేటివ్ నినాదంతో ముందుకు వెళుతున్న తమ సంస్థ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 60 ఏళ్లు దాటిన జంటలకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్ కుమార్, కేబినెట్ సెక్రటరీ జి.సురేష్, కోశాధికారి కేశవరావు, నాగప్రశాంత్, వైస్ గవర్నర్ యెండూరి రాఘవ కుమారి, నిడమానూరు శ్రీనివాస ఫణి రాజేష్, కోచైర్మన్ గ్రంధి సుజాత, రీజియన్ చైర్మన్లు చెక్కా సురేష్ కుమార్, సిహెచ్ వి ఎన్‌పి చంద్రగుప్తా, రాజా నాగరత్నకుమార్ పాల్గొన్నారు.